ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 31 జులై 2024 | 5

వివాహం కావట్లేదన్న మనస్తాపంతో తమ్ముడిపై కత్తితో అన్న దాడి 7లో

కరెంట్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ వాసి మృతి 7లో

వణికిస్తున్న జ్వరాలు



కాకినాడ జీజీహెచ్‌లో జనరల్ వార్డులో రోగుల తాకిడి

- వైరల్ ఫీవర్లతో ప్రజలు విలవిల
- జ్వరంతోపాటు వాంతులు, విరోచనాలు, రొంప, దగ్గు లక్షణాలు
- రోజుల తరబడి మందులు వాడాల్సిన పరిస్థితి
- వాతావరణ మార్పులే కారణమంటున్న వైద్యులు
- అదే అదనుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షల్లో బిల్లులు

చిన్న, పెద్ద తేడా లేదు. వయస్సుతో నిమిత్తం లేకుండా వైరల్ జ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి. జ్వరంతోపాటు వాంతులు, విరోచనాలు, దగ్గు, రొంప వంటి నొప్పులు వంటి లక్షణాలతో బాధపడుతూ ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రోజుల తరబడి మందులు వాడుతున్నా జ్వరం అదుపులోకి రాకపోవడం, తగ్గినా మళ్లీ మళ్లీ రావడంతో వీటిని బారిన పడిన వారు నీరసించిపోతున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో రకరకాల పరీక్షలు, ప్లేట్‌లెట్లు ఎక్కించడం పేరుతో లక్షల్లో బిల్లులు గుంజుతున్నారు.

పిఠాపురం/తుని, జూలై 30: జ్వరం, వాంతులు, విరోచనాలు, దగ్గు, రొంప, వంటి నొప్పులతో బాధపడుతున్న వారి సంఖ్య కాకినాడ జిల్లాలో ప్రతిరోజూ వందల్లో ఉంటోంది. వాతావరణంలో జరిగిన మార్పులు, రోజుల తరబడి ముసురు వాతావరణం, ఆపై ఉక్కపోత పెరిగిపోయి, వర్షం కురుస్తుండగానే ఎండకాయడం, దోమల బెడద అధికం కావడం ఇందుకు కారణమవుతున్నాయి. ఈ వాతావరణంలో బయట తిరిగిన వారు, పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు, చల్లగాలికి బయటకు వచ్చిన చిన్నారులకు జ్వరం, రొంప, దగ్గుతోపాటు వాంతులు, విరోచనాలు అవుతున్నాయి.

జిల్లాలో కాకినాడ నగరంతోపాటు పిఠాపురం, సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం, తుని పట్టణాలతోపాటు అన్ని మండలాల పరిధిలోని గ్రామాలు జ్వరాలతో వణుకుతున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణ, అపారిశుధ్య పరిస్థితులు, నెలల తరబడి డ్రెయిన్లల్లో పూడికలు తొలగించకపోవడం వంటి కారణాలతో దోమల బెడద అధికంగా ఉంది. అదే సమయంలో వాతారవరణ మార్పులు తోడు కావడంతో జ్వరం తదితర లక్షణాలతో బాధపడుతూ కాకినాడ ప్రభుత్వాస్పత్రితోపాటు జిల్లాలోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు రోగులు అధికంగా తరలి వస్తున్నారు. ఇక్కడ ఓపీకి వచ్చి ఓపీ చూపించుకుంటున్న వారిలో 50శాతం వరకూ జ్వరపీడితులే ఉంటున్నారు.

ఎంతకు తగ్గక..

వచ్చిన జ్వరం ఎంతకూ తగ్గకపోవడం, తగ్గినా మళ్లీ తరచూ రావడంతో రోగులు నీరసించిపోతున్నారు. జ్వరం, వాంతులు, విరోచనాలు, దగ్గు, రొంపతో బాధపడుతున్న వారికి సాధారణంగా యాంటీబయాటిక్స్‌తోపాటు పారసిట్మాల్ ఇతర మాత్రలు ఇస్తే తగ్గిపోతుంది. మరీ ఎక్కువగా ఉంటే రెండు నుంచి ఐదురోజులపాటు ఇన్‌పేషెంట్లుగా ఉంచి చికిత్స అందిస్తే జ్వరం పూర్తిగా నియంత్రణలోకి వస్తుంది. ఈసారి వస్తున్న వైరల్ జ్వరాలు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. జ్వరం ఒక్కటే వచ్చినా మనిషి పూర్తిగా నీరస పడేటట్లు చేయడంతోపాటు నొప్పులు అధికంగా ఉంటున్నాయి. ఒకటి రెండు రోజులు ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మనిషి లేవలేని స్థితికి చేరుకుంటున్నారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లీ రావడం, వచ్చినవారికే రెండు, మూడుసార్లు జ్వరాలు రావడం ఆందోళన కలిగిస్తోంది. చిన్నారులనుంచి, యువతీ, యువకులు, మధ్య వయస్కులు, వృద్ధుల్లోనే ఇదే పరిస్థితి ఉంటోంది.

ఇదే అదనుగా...

ఒకసారి జ్వరం వచ్చి మళ్లీ రావడం, అధికంగా జ్వరం రావడంతో ఆందోళనకు గురవుతున్న ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా కార్పొరేట్‌తోపాటు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు రోగులను, వారిని తీసుకువచ్చిన వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నారు. ప్లేట్‌లెట్లు పడిపోయాయని, ఇది ప్రమాదకర జ్వరమని చెప్తూ వివిధ పరీక్షలు పేరిట, ఖరీదైన మందులు వాడాలని, ప్లేట్‌లెట్లు ఎక్కించాలని చెప్పి భారీగా డబ్బులు లాగేస్తున్నారు. జ్వరం, వాంతులు, విరోచనాలు, దగ్గు, రొంప, వంటి నొప్పులు లక్షణాలతో వెళ్లిన వారికి రూ.లక్ష తక్కువ కాకుండా బిల్లు వేస్తున్నట్లు రోగుల బంధువులు చెబుతున్నారు. తక్కువ వ్యవధిలోనే రెండుసార్లు జ్వరంవస్తే ఇంత కంటే అధికంగా బిల్లులు వేస్తున్నారని తెలిపారు. అధికంగా బిల్లులు వేయడమే గాక ఈ జ్వరాలు అత్యంత ప్రమాదకరం అంటూ హెచ్చరిస్తుండడంతో రోగుల వెంట వచ్చిన వారు కలవరానికి గురవుతున్నారు.

జిల్లాలో నమోదైన డెంగ్యూ కేసులు

సంవత్సరాలు	కేసులు
2019	513
2020	072
2021	502
2022	523
2023	224
2024లో	ఇప్పటికి 60కేసులు

జ్వరపీడితుల కోసం సర్వే

వైరల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు అందజేస్తున్నారు. అవసరమైన వారినుంచి బ్లడ్‌శాంపిల్స్ సేకరిస్తున్నారు. జ్వరం, ఇతర లక్షణాలు అధికంగా ఉంటే సమీపంలోని పీహెచ్‌సీ, ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు.

తొలిదశలోనే గుర్తిస్తే మేలు

జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రి, అర్బన్‌హెల్త్ సెంటర్‌కు వెళ్లి అక్కడ ఉన్న వైద్యులకు చూపించి తగిన చికిత్స చేయించుని వారు సూచించి ఇచ్చిన మందులు వాడితే జ్వరం తగ్గుతుందని వైద్యాధికారులు సూచిస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగానే జ్వరంతోపాటు రొంప, దగ్గు వస్తున్నాయని, కొందరికి వాంతులు, విరోచనాలతోపాటు వంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని వారు తెలిపారు. వీరికి అవసరమైతే ఇన్‌పేషెంట్లుగా ఉంచి చికిత్స అందజేస్తారని వారు చెప్పారు. జ్వరాల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జ్వరం లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స చేయించుకుని వైద్యులు చెప్పిన జాగ్రత్తలు, చెప్పిన ప్రకారం మందులు వాడితే సరిపోతుందని వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, చిన్నారులకు దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు.

జేఎన్టీయూకే ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా రవీంద్రనాథ్ బాధ్యతల స్వీకరణ



ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్

జేఎన్టీయూకే, జూలై 30: కాకినాడ జేఎన్టీయూకే ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. తనను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమించి తనకు గురుతర బాధ్యతను అప్పగించారన్నారు. ప్రొఫెసర్ జి.ఏసురత్నం డీఏఏగానూ, ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు యూసీఈకే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గాను బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా యూసీఈకేలో 1950లో విద్యనభ్యసించి మెట్రోమ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన పూర్వవిద్యార్థి, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ ఈ.శ్రీధరన్ వీడియోకాల్‌లో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన రవీంద్రనాథ్, ఏసురత్నం, మోహన్‌రావులను ఇన్‌చార్జివీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ,రెక్టార్ కేవీ రమణ,మాజీ వీసీలు జీవీఆర్ ప్రసాదరాజు, కె.పద్మరాజు,డైరెక్టర్లు అభినందించారు.

22మంది వాహనదారులకు రెండురోజుల జైలుశిక్ష

కాకినాడ క్రైం, జూలై 30: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఎస్పీ విక్రమ్ పాటిల్ ఆదేశాల మేరకు కాకినాడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్-1, 2 పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా 48మంది మద్యం తాగినట్లు నిర్ధారించారు. వీరిని మూడో ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా 22మంది వాహనదారులకు రెండేసిరోజులు జైలుశిక్ష విధిస్తూ జడ్జి వి.నరసింహారావు తీర్పునిచ్చారు. మరో 26మందికి తలో రూ.10వేల వంతున రూ.2.60లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ సీఐలు డీఎస్ చైతన్య కృష్ణ, రమేష్ తెలిపారు.

గుంతలను పూడ్చేస్తారా?



కాకినాడ నగరంలో గుంతల రహదారి

- జిల్లావ్యాప్తంగా గుంతల రహదారుల మరమ్మతులకు ప్రతిపాదనలు
- రూ.37.25కోట్ల ప్రతిపాదనలు పంపిన ఆర్‌అండ్‌బీ అధికారులు
- ఆగస్టు 1న మంత్రి సమావేశానికి హాజరవుతున్న అధికారులు
- నిధుల విడుదలపై ప్రస్తావన

కలెక్టరేట్(కాకినాడ), జూలై 30: జిల్లావ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రహదారులు గుంతలమయంగా తయారయ్యాయి. ఎక్కడ చూసినా గుంతలతో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో రోడ్డు మరమ్మతులకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనివల్ల ఐదేళ్ల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో వివిధ మరణాలు నమోదు కాగా, కొందరు క్షతగాత్రులుగా మిలిగిపోయారు. వైసీపీప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పరిపాలన వ్యవస్థ గాడిలో పడుతుంది. అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లాలో రోడ్డు మరమ్మతుకు సంబంధించి రూ.37.25కోట్లు కావాలని ఆర్‌అండ్‌బీ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు మంజూరైతే టెండర్లు పిలిచి పనులు చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఆగస్టు 1న అమరావతి పరిధిలో రాష్ట్ర రోడ్డు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారు. జిల్లానుంచి కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీర్ కాంతు హాజరవుతున్నారు. ఆ సమావేశంలో జిల్లాలో ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిస్థితి, నిధుల ఆవశ్యకతపై మంత్రికి ఆయన వివరించనున్నారు.

ప్రతిపాదనలో అంశాలు

కాకినాడ ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో ఉన్న కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం డివిజన్‌ల పరిధిలో 702 కిలోమీటర్ల పరిధిలో గుంతల మరమ్మతు చేయాలని, 333 కిలోమీటర్ల మేరకు వేగంగా మరమ్మతు చేయాలని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. గుంతల మరమ్మతుకు రూ.7కోట్ల 2లక్షలు కావాలని, అర్జంట్‌గా చేపట్టే మరమ్మతు పనులకు రూ.30కోట్ల25లక్షలు కావాలని పేర్కొన్నారు. రూ.37.25 లక్షల నిధులు విడుదల చేయాలని సూచించారు. కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం పరిధిలోఉన్న రాష్ట్ర రహదారులు 180 కిలోమీటర్లు మరమ్మతు చేయాలని ప్రతిపాదించారు. కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం పరిధిలో జిల్లామేజర్ రహదారులు 522 కిలోమీటర్లు మరమ్మతు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. అర్జంట్ మరమ్మతు కింద ఈ నాలుగు డివిజన్లలో 93 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారులకు మరమ్మతు చేయాలన్నారు. ఈ నాలుగు డివిజన్ పరిధిలో జిల్లా మేజర్ రోడ్లు 240 కిలోమీటర్ల మేరకు తక్షణ మరమ్మతు కింద ప్రతిపాదించారు.

ప్రభుత్వం రూ.37.25కోట్ల నిధులను విడుదల చేసిన వెంటనే టెండర్లు పిలవడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. టెండర్లు పిలిచిన తర్వాత పనులు వేగవంతంగా చేయడానికి కార్యాచరణ రూపొందించారు.

వర్షాకాలం నేపథ్యంలో అత్యధిక ప్రాధాన్యం

వర్షాకాలం నేపథ్యంలో రోడ్లుమరమ్మతుకు ప్రభుత్వం అత్యధికంగా ప్రాధాన్యమిస్తుంది. కాకినాడ ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో ఉన్న కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమహేంద్రవరం పరిధిలో నిత్యం వేలాది వాహనాలు ప్రయణిస్తున్నాయి. రోడ్లు అధ్వానంగా ఉండడంవల్ల తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పైగా వర్షాకాలం కావడంతో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో రాత్రి సమయాల్లో ప్రయాణికులకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నిధులు విడుదలైన వెంటనే టెండర్లు

కాకినాడ సర్కిల్ ఆర్‌అండ్‌బీ పర్యవేక్షక ఇంజినీర్ కాంతు మాట్లాడుతూ రూ.37.25కోట్ల నిధులకు సంబంధించిన మంజూరుపై పరిపాలన ఆమోదం రాగానే టెండర్లు పిలుస్తామన్నారు. టెండర్లు ఖరారైన తర్వాత పనులు వేగంగా అయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటామని, ఈ మేరకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి సమీక్షా సమావేశానికి కూడా హాజరవుతున్నామని స్పష్టం చేశారు.

సొంతింటి కల.. సాకారం దిశగా..



- నెరవేరనున్న పేదోడి సొంతింటి కల
- రూ.4లక్షలతో ఇంటినిర్మాణానికి నిర్ణయం
- నూతన లబ్ధిదారులకే వర్తింపు
- జిల్లాలో 1.60 లక్షల మందికి ప్రయోజనం
- గతంలో స్థలం వచ్చి కట్టని వారికీ సహాయం
- అమలు దిశగా కూటమి ప్రభుత్వ హామీలు

సామర్లకోట, జూలై 30: పేదలందరికీ ఇళ్లు నిర్మించే దిశగా కూటమి ప్రభుత్వం చకచకా అడుగులు ముందుకే వేస్తోంది. పేదవారి ముఖాన చిరునవ్వు పింఛన్ల పంపిణీలో చూసిన కూటమి ప్రభుత్వం తిరిగి అదే ఒరవడి కొనసాగిస్తూ పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు గృహ నిర్మాణాలను చేపట్టేందుకు ముందుకొచ్చింది. రెండు రోజులుగా గృహనిర్మాణ పథకంపై ఉన్నతాధికారులతో సమాలోచనలు జరిపిన తర్వాత పేదలకు గృహనిర్మాణానికి రూ.4లక్షల వ్యయం చేసేందుకు నిర్ణయించడం సర్వత్రా హర్షాతిరేఖాలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కొక్క లబ్ధిదారుడికి గ్రామీణ ప్రాంతాల్లో 3సెంట్లు(144 చ.గ), పట్టణ పరిధిలో 2 సెంట్లు(96 చ.గ) చొప్పున ప్రభుత్వం స్థలాలు పంపిణీ చేయడమే గాక ఆ స్థలాల్లో రూ.4లక్షల వ్యయంతో ఇళ్లు నిర్మించనున్నారు. ఇందుకోసం నూతనంగా మార్గదర్శకాలు మరో రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం వెల్లడించనున్నట్లు జిల్లా గృహ నిర్మాణ అధికారుల ద్వారా తెలిసింది. 2024-25 పీఎంఏవైయు 2.0 పథకంగా నిర్ణయించిన ఈ పథకంలో కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేయనుంది. ఇంటి నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.2.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.1.50లక్షల చొప్పున కేటాయించనుంది.

కేంద్ర మార్గదర్శకాల్లో మార్పులు

గత వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల పథకానికి ఒక్క రూపాయి సొంతంగా(పట్టణాల్లో రూ.30వేలు మినహా) కేటాయించకుండా ఐదేళ్ల పదవీకాలం గడిపిన నిర్వాకంతో తాజాగా కేంద్రప్రభుత్వం ఈ పథక మార్గదర్శకాలను పూర్తిగా మార్పులు చేసింది. గృహనిర్మాణ లక్ష్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని నిర్దేశించడంతో అందుకు కూటమి ప్రభుత్వం కూడా సరేనన్నట్లు సమాచారం. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కేంద్ర బృందాల ద్వారా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సర్వే జరిపించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణంలో తీవ్రమైన జాప్యం, నిర్మించిన ఇళ్లపై ఒక్క రూపాయి భరించని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం జగన్ బొమ్మలు వేయించడంపై సర్వే బృందాలు ఇచ్చిన నివేదికల ఆధారంగా 2024-25 నుంచి అమలు చేయనున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజనా(పట్టణ) 2.0 పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను సవరించినట్లు అధికారులు తెలిపారు. దీని ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా నిధులను జతచేసి ఇళ్లను నిర్మించాలని నిర్దేశించినట్లు తెలిసింది. దీనిప్రకారం నూతనంగా ఎంపిక చేసే లబ్ధిదారులకు నిర్మించే ఇంటికి కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.2.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.1.50లక్షల చొప్పున వ్యయం చేయాల్సి ఉంది. ఆయా ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానం దృష్ట్యా కేంద్రం అదనంగా నిధులు కేటాయించనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్లను నిర్మించడంలో తీవ్ర అవకతవకలకు పాల్పడి వైసీపీ నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80లక్షల సొమ్ముకు ఇంటి నిర్మాణాలు పూర్తి కాలేదు. దీంతో లబ్ధిదారులు తమ సొంత సొమ్ములు ఆరేడు రెట్లు అధికంగా వెచ్చించి ఇంటి నిర్మాణాలను పూర్తి చేయగా అదేదో తామే నిర్మించినట్లు డబ్బాలు కొట్టిన అప్పటి ప్రభుత్వం సామూహిక గృహప్రవేశాలు పేరిట అప్పటికే లబ్ధిదారులు చేసిన ఇళ్లకు గృహప్రవేశాలు ఆట్టహాసంగా జరిపారు. అయినా ఏ లేఅవుట్‌లోనూ గృహనిర్మాణాల లక్ష్యాలను పూర్తి చేయలేకపోయారు.

లబ్ధిదారుల్లో ఆనందం

పీఎంఏవై(పట్టణ)-2.0 పథకంగా జిల్లాలో 1.60లక్షల ఇళ్లను నిర్మించాలన్న లక్ష్యాలను జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాథమికంగా నివేదికలను రూపొందించారు. ఇప్పటికే గత ప్రభుత్వం వేసిన లేఅవుట్ల్లో చాలా స్థలాలు ఖాళీగానే ఉన్నాయి. వాటితోపాటు నూతనంగా స్థలాలను గుర్తించి పేదలకు ఇళ్ల పట్టాలుగా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్‌ల్లో తాజాగా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున పంపిణీ చేయనున్నారు. గత ప్రభుత్వంలో స్థల కేటాయింపులు మాత్రమే జరిగి ఇంటి నిర్మాణాలకు నోచుకోని లబ్ధిదారులకు సైతం కొత్త గృహనిర్మాణ పథకంలో రూ.4లక్షలు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో లబ్ధిపొందినవారు ఇప్పటికే ఇంటి నిర్మాణాలకు చేసిన అప్పులు పాలు కాగా ఇప్పుడు రూ.4లక్షల వ్యయంతో ఇంటినిర్మాణాలు జరగనుండడంతో ఢీలాపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వానికి ముందు లబ్ధిదారులు తమ సొంత స్థలాల్లో ఇంటిని నిర్మించుకుని ప్రభుత్వ సాయంకోసం ఎదురుచూశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం స్థానంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి టిడ్కో ఇళ్లను అప్పగించకపోవడమేగాక సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసినవారికి ప్రభుత్వ సాయాన్ని విస్మరించారు. ఇది ఒకవిధంగా లబ్ధిదారులు అప్పుల భారాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన సమీక్షలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో నిర్మించుకున్న ఇళ్ల లబ్ధిదారులకు సైతం ఆర్థికసాయాన్ని అందించేందుకు నిర్ణయించినట్లు సమాచారం రావడంతో ఆనాటి లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మరో రెండు, మూడురోజుల్లో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ అనుమతులతో మార్గదర్శకాలను వెలువరించనుంది.

సాంఘిక సంక్షేమశాఖ జేడీ బదిలీ

కార్పొరేషన్(కాకినాడ), జూలై 30: సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డి.వి.రమణమూర్తి బదిలీ అయ్యారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) అడిషనల్ కమిషనర్‌గా సంవత్సర కాలానికి డిప్యూటేషన్ ప్రాతిపదికన ఆయన్ను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వసాయం అందేలా కృషి
- కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు 7లో

ఎస్పీ కార్యాలయ క్లర్క్‌పై విచారణ 7లో

రేపే పింఛన్ల పంపిణీ

- సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ అందజేత
- నగరపాలక సంస్థ పరిధిలో 30,304 మందికి పెన్షన్ సొమ్ము రూ.12.82కోట్లు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 30: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని పింఛన్‌దారులకు ఆగస్టు నెల పింఛన్ పంపిణీకి 1న అందేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో అసాధ్యం కాదన్నది ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు సుసాధ్యం చేసి చూపించారు. కేవలం సచివాలయ సిబ్బందితోనే ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయడంలో సఫలీకృతులయ్యారు. జూలైలో పెంచిన పింఛన్ మొత్తాన్ని బకాయిలతోపాటు పంపిణీ చేశారు. ఇక అదే విధానాన్ని కొనసాగిస్తున్నారు. ఆగస్టులో కూడా 1వతేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటింటికీ పంపిణీ చేయడానికి అధికారులు అన్నిఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 645మంది సచివాలయ ఉద్యోగులకు బాధ్యత అప్పగించారు. వృద్ధులు, వితంతవులకు రూ.4వేలు,దివ్యాంగులకు రూ.6వేలు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు రూ.10వేల చొప్పున పింఛన్లు అందజేయనున్నారు. కార్పొరేషన్ పరిధిలో 645మంది సిబ్బంది ఈపింఛన్లు పంపిణీ చేయనున్నారని అధికారులు చెపుతున్నారు. లబ్ధిదారులు 30,304మంది ఉండగా వీరికి రూ.12కోట్ల82లక్షల32వేలుపంపిణీ చేయాల్సి ఉంది.

1నే 90శాతం పింఛన్లు అందించాలి: కమిషనర్

నగరపాలక సంస్థ పరిధిలోని పింఛన్‌దారులందరికీ ఆగస్టు 1న పింఛన్ పంపిణీ చేసే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశాం. జాబితాలో అందుబాటులో లేని లబ్ధిదారులకు 2వతేదీన పంపిణీ చేయాలని సూచించాం. తొలిరోజు 90శాతం పింఛన్ పంపిణీ జరిగేలా అధికారులతో తగిన ప్రణాళికలు రూపొందించాం.

సామాజిక విజ్ఞానాభివృద్ధికి రాంషా కృషి ఎనలేనిది

- శత జయంతి సభలో వక్తలు



రాంషా శతజయంతి సభలో పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 30: సామాజిక విజ్ఞానాభివృద్ధికి ప్రముఖ సాహితీవేత్త, అభిసారిక దాంపత్య విజ్ఞాన మాసపత్రిక పూర్వ సంపాదకులు దర్భా రాంషా చేసిన కృషి ఎనలేనిదని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. కాకినాడ కల్పన సెంటర్‌లోని రోటరీ సర్వీస్ సెంటర్‌లో రాంషా శత జయంతి సభను మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించి మాట్లాడారు. విశ్రాంత ఆచార్యులు టి.విశ్వనాథరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, ఆధ్యాత్మికవేత్త కాశీభొట్ల సత్యనారాయణ, జయంతి నాగేశ్వరరావు, కర్రా కార్తికేయశర్మ పుస్తకావిష్కరణలు చేశారు. అనంతరం సాహిత్య రంగంలో మాకినీడి సూర్య భాస్కర్, ప్రొఫెసర్ డాక్టర్ గోదా వెంకటరమణలకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి తొలుత రాంషా దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన పలువురు ప్రముఖ సాహితీవేత్తలు, రాంషా కుటుంబ సభ్యులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



వరదకు కొట్టుకుపోయిన కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి



రహదారి ఛిద్ర(త్రం)ం

గోదావరి వరదలకు రహదారులు ఛిద్రమయ్యాయి. ముఖ్యంగా కూనవరం-భద్రాచలం ప్రధాన రహదారి పోలిపాక వద్ద గోదావరి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. పోలిపాక గ్రామానికి వెళ్లే సీసీ రోడ్డు వరద తాకిడికి నిట్టనిలువుగా చీలిపోయింది. (కుడివైపు చిత్రం)

- కూనవరం



బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

తగ్గుతున్న గోదావరి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ

12.60 అడుగులకు తగ్గిన నీటిమట్టం

11.19 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

భద్రాచలం వద్ద స్వల్పంగా పెరుగుతున్న వరద

ధవళేశ్వరం, జూలై 30: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం ఆరు గంటలకు నీటిమట్టం 13.70అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. గంటకు ఒక్క పాయింటు చొప్పున క్రమంగా తగ్గుతున్న నీటిమట్టం రాత్రి ఏడు గంటలకు 12.60 అడుగులకు చేరుకోగా 11,19,425 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. బుధవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించే స్థాయికి నీటిమట్టం తగ్గవచ్చని అధికారుల అంచనా. ఎగువన తెలంగాణ పరివాహకంలోని లక్ష్మీ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేయడంతో కాళేశ్వరం వద్ద నీటిమట్టం పెరుగుతోంది. ఆ ప్రభావంతో దిగువన భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు నీటిమట్టం 43.60 అడుగులుగా నమోదైంది.

మొన్న...



తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నుంచి ఒడిసాకు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ నవీన్ నిద్రమత్తు కారణంగా చింతూరు మండలం నిమ్మలగూడెం-కుయుగూరు మధ్య జాతీయ రహదారిపై వరద నీటిలో మునిగిపోయింది. అతడు ఆదివారం రాత్రంతా తాటిచెట్టుపై ఉండి ప్రాణాలతో బయటపడిన విషయం విదితమే. రహదారిపై వరద నీరు మంగళవారం క్రమంగా తగ్గడంతో టిప్పర్ బయటపడింది.

- చింతూరు

నేడు...





దాతకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో కిషోర్‌కుమార్

అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూలై 30: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కాకినాడ జిల్లా తుని మండలం ఎస్.అన్నవరానికి చెందిన దాడిశెట్టి విష్ణు చక్రం-రమాజ్యోతి దంపతులు రూ.1,00,500 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ అందించారు. వివిధ సేవల ద్వారా మంగళవారం రూ.2,14,376 ఆదాయం లభించినట్టు ఆయన చెప్పారు.



అపర్ణాదేవికి కదంబ పుష్పాలతో పూజ

గొల్లప్రోలు రూరల్, జూలై 30: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి మంగళవారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి కుంకుమ పూజ, సహస్ర నామార్చన జరిపి కదంబ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.



నాటు తుపాకీతో ఇద్దరి అరెస్టు

గోకవరం, జూలై 30: నాటు తుపాకీ కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను గోకవరం పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఎస్ఐ కె.నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... గంగవరం మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన పాతర అప్పారావు, రంపచోడవరం మండలం గొట్లగూడెం గ్రామానికి చెందిన పోడియం పొట్టిదొర గోకవరం మండలం కొత్తపల్లి గ్రామ శివారులో నాటు తుపాకీతో సంచరిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించిన వీఆర్వో ఎం.వెంకట్రావు ఫిర్యాదు మేరకు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని వారి నుంచి నాటు తుపాకీ, మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. సూరంపాలెం ప్రాజెక్టు పరసర ప్రాంతాల్లో వేటాడేందుకు వెళ్లి అక్కడ వేపచెట్టు కింద నాటు తుపాకీతో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు నిద్రపోయినట్టు విచారణలో తేలింది.

కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయ క్లర్క్‌పై విచారణ

కాకినాడ క్రైం, జూలై 30: జిల్లా ఎస్పీ కార్యాలయంలో డిస్పాచ్ విభాగంలో పనిచేస్తున్న జి.శ్రీనివాస్ ఉన్నతాధికారులకు వచ్చిన లేఖలను విప్పి చదువుతూ వాటిని ఫొటో తీసి చివరికి అధికారులకు పట్టుబడ్డాడు. శ్రీనివాస్ లెటర్ల ఎన్వలప్ కవర్లను తెరిచి వాటి లోపల ఉన్న లేఖలను ఫొటో తీసి తిరిగి అంటించి ఏ అధికారి లెటరు ఆ అధికారికి పంపిస్తున్నాడు. కొత్త ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు వచ్చిన లేఖను శ్రీనివాస్ చదివి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. సోమవారం సాయంత్రం ఎస్పీకి వచ్చిన లెటర్ ఎన్వలప్ కవరు అతికిన విధానాన్ని ఎస్పీ నిశితంగా పరిశీలించారు. కవరు జిగురు అప్పుడే అటించి ఉన్నట్లు గమనించారు. దీంతో డిస్పాచ్ క్లర్క్ శ్రీనివాస్‌ను పిలిచి తాను చేసిన తప్పును తన నోటితో చెప్పించారు. అనంతరం శ్రీనివాస్‌కు చార్జ్ మెమో ఇచ్చారు. ఇదే తరహాలో గ్రీవెన్స్‌కు వచ్చే పిటీషన్‌లు శ్రీనివాప్ తెరిచి చూస్తున్నాడనే అనుమానాలు రేకత్తడంతో అతడిపై విచారణ చేయాలని ఎస్పీ ఆదేశించారు.





పి.గన్నవరం అక్విడెక్టు వద్ద యువకుడి మృతదేహాన్ని బయటకు తీస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఉడిమూడిలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

విషాదాంతం

పడవ ప్రమాదంలో గల్లంతైన విజయకృష్ణ మృతదేహం పి.గన్నవరం అక్విడెక్టు వద్ద లభ్యం

పి.గన్నవరం, జూలై 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటి పెదపూడి వద్ద పడవ ప్రమాదంలో గల్లంతైన చదలవాడ విజయ కృష్ణ ఆచూకీ పి.గన్నవరం అక్విడెక్టు వద్ద మంగళవారం లభ్యమైంది. అక్విడెక్టు కాల్వ తొట్టెకు అడ్డుపడిన చెత్తలో మృతదేహాన్ని గుర్తించిన బంధువులు అధికారులకు సమాచారం అందించారు. ఎస్ఐ బి.శివకృష్ణ అక్విడెక్టు వద్దకు చేరుకుని ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సుమారు రెండు గంటల పాటు కష్టించి బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని అక్విడెక్టు వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు. కాగా విజయకృష్ణ కుటుంబాన్ని ఉడిమూడిలో కోనసీమ జిల్లా కలెక్టర్ ఎం.మహేష్‌కుమార్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరామర్శించి ప్రభుత్వం అందించిన రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎంతవరకు చదువుకున్నావని మృతుని సోదరిని కలెక్టర్ అడిగి ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఆర్థిక సాయం అందించామని ఎమ్మెల్యే చెప్పారు. నెల వ్యవధిలో మృతుడు సోదరి కళ్యాణికి ఉద్యోగం వచ్చేలా చూస్తామన్నారు. తహసీల్దారు ఎస్కే హుస్సేన్, సర్పంచ్ ఎన్.ప్రసన్న కుమార్, మద్దా చంటిబాబు, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు, ఏసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

ఐదుగురు అరెస్టు.. 75 సెల్‌ఫోన్లు స్వాధీనం

అమలాపురం టౌన్, జూలై 30: ఆన్‌లైన్ బెట్టింగ్ జరుగుతోందన్న సమాచారంతో అమలాపురం పట్టణ పోలీసులు పక్కా ప్రణాళికతో దాడి చేశారు. బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. సీఐ కె.క్రిస్టఫర్ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న అంబికా లాడ్జిలో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. అమలాపురం రూరల్ భట్లపాలెం గ్రామానికి చెందిన మోటూరి దొరసత్యసూర్య మణికంఠ అలియాస్ నాని (25), మోటూరి మధుపవన్ అలియాస్ సతీష్ (23), ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన భలేప్రవీణ్‌బాబు (27), భీమవరం సమీపంలోని గునుపూడికిచెందిన పంజా సాయినరసింహ అలియాస్ (నాని) (19), గురజాపు సూర్యప్రభు అలియాస్ సూర్య (21)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఐదు ల్యాప్‌టాప్‌లు, 75 సెల్‌ఫోన్లు 15 సిమ్‌కార్డులు, 19 బ్యాంక్ చెక్‌బుక్‌లు, 25 ఏటీఎం కార్డులు, 7 నోట్‌బుక్‌లు, ఒక వైఫై రూటర్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం అమలాపురం కోర్టులో హాజరుపరిచారు. గూగుల్ ప్లేస్టోర్‌లో ఉన్న యాప్‌ల్లోకి వాట్సాప్ లింకుల ద్వారా ప్రవేశించి బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఆ యాప్‌లను తొలగించేందుకు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గూగుల్‌కు లేఖలు పంపించామన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాను అరెస్టు చేసిన పోలీసులను ఎస్పీ బి.కృష్ణారావు అభినందించారు.



ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి

కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, జూలై 30: హత్యకు గురైన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం కుటుంబానికి ప్రభుత్వ సాయం అందేలా కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్‌గా పని చేసిన తమ కుమారుడు సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసిన వారికి శిక్షపడేలా చేసి తమకు న్యాయం చేయాలని అతని తల్లిదండ్రులు మంగళవారం ఎమ్మెల్యే కొండబాబును కలిసి విన్నవించారు. బాధిత కుటుంబం పరిస్థితిని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు పిట్టా వరప్రసాద్ ఎమ్మెల్యేకు వివరించారు. అప్పట్లో సుబ్రహ్మణ్యం హత్య ఘటన సమయంలో బాధిత కుటుంబా నికి అండగా నిలబడిన కొండబాబు ప్రస్తుతం అధికారంలో ఉన్నందున సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి దోషులకు శిక్షపడేలా చూడాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే కొండబాబు సానుకూలంగా స్పందిస్తూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, నగర ఉపాధ్యక్షుడు బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండబాబుతో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు

కరెంట్ షాక్‌తో పశ్చిమ బెంగాల్ వాసి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు.. టవర్లపై ఎర్త్ వైర్ లాగుతుండగా ఘటన

కరప, జూలై 30: కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్ట పంట పొలాల్లో మంగళవారం ఉదయం కరెంట్ షాక్ తగిలి పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.... పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎనిమిది మంది కూలీలు అరట్లకట్టలో ట్రాన్స్‌కోకు చెందిన 132/11 కేవీ విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. దీనిలో భాగంగా అక్కడున్న నాలుగు టవర్లలో రెండు టవర్ల మీద ముగ్గురేసి చొప్పున ఎక్కి ఎర్త్ వైరును లాగుతున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా ఎలక్ట్రికల్ ఇండక్షన్ (విద్యుత్ ప్రేరణ) కలగడంతో రెండు టవర్ల మీద ఉన్న కూలీలు ఎర్త్ వైర్‌ను వదిలేశారు. అదే సమయంలో కింద పనిచేస్తున్న షేక్ షహిదుల్(20)పై ఎర్త్ వైరు పడడం, అతను బురదలో ఉండడంతో విద్యుత్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అక్కడే ఉన్న మరో కూలీ కూడా షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. షహిదుల్‌ను కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. మరో క్షతగాత్రుడు ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.



షహిదుల్ మృతితో సహచర కూలీలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కూలీల్లో మృతుడి సోదరులు కూడా ఉన్నట్టు తెలిసింది. వారు పశ్చిమ బెంగాల్‌లో ఉన్న షహిదుల్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి బంధువు కాంట్రాక్టర్‌గా ఈ పనులు చేయిస్తున్నట్టు తెలిసింది. దీంతో విషయం బయటకు పొక్కకుండా ట్రాన్స్‌కో అధికారులు ప్రయత్నించినట్టు సమాచారం. కరప పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ప్రేమించానని వంచన

- తట్టుకోలేక యువతి ఆత్మహత్య
- యువకుడి అరెస్టు... రిమాండుకి తరలింపు

రాజమహేంద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి ఆత్మహత్యకు కారణమైన యువకుడిని అరెస్టు చేశామని సౌత్‌జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబికానగర్‌లో నివసిస్తున్న 29ఏళ్ల దళిత యువతి సీతానగరం మండలం వంగలపూడికి చెందిన 22ఏళ్ల షేక్ నాగూర్‌బాబు నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెద్దలకు తెలియడంతో ఏడాది తర్వాత పెళ్లి చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో ఆమెతో నాగూర్ అనేక విధాలైన లోన్లు పెట్టించాడు. ఆ విధంగా మొత్తం రూ.11,97,417 తన సొంతానికి వాడుకున్నాడు. తర్వాత ఆమెను వదిలించుకోడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఉద్దేశపూర్వకంగా ఆమెను కులం పేరుతో బూతులు తిట్టడంతో పాటు తీవ్రమైన మానసిక వేదనకు గురిచేశాడు. దీంతో గత నెల 29వ తేదీ అర్థరాత్రి సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మరణించింది. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని డీఎస్పీ పేర్కొన్నారు. ఆమె హ్యాండ్ బ్యాగ్‌లో సూసైడ్ నోట్ ఉండడంతో పాటు పలు విషయాలు వెలుగు చూశాయన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు.

వివాహం కావట్లేదన్న మనస్తాపంతో తమ్ముడిపై కత్తితో అన్న దాడి

కొత్తపల్లి, జూలై 30: ఇంట్లో అందరికీ వివాహాలు జరిగి మధ్యలో ఉన్న తనకు వివాహం కావట్లేదన్న మనస్తాపంతో సొంత తమ్ముడిపై అన్న బండ కత్తితో దాడి చేసిన ఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం శ్రీరాంపురంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీరాంపురం గ్రామానికి చెందిన పిర్ల రామకృష్ణ కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ముల మధ్యవాడు. పెద్ద కుమారుడికి, చిన్న కుమారుడికి వివాహాలు జరిగాయి. మధ్యలో ఉన్న వివాహం కాని రామకృష్ణకు ఫిట్స్ రావడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. రామకృష్ణ అన్న కుమారునికి ఆరోగ్యం బాగోక మూడు రోజులుగా కాకినాడ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అన్న రామకృష్ణకు సోదరుడు సత్తిబాబు మంగళవారం మధ్యాహ్నం భోజనం క్యారేజీ తీసుకొచ్చాడు. మూడు రోజుల పాటు తనకు తిండి, తిప్పలు లేవని, ఒంటరిగా వదిలేశారని కోపోద్రిక్తుడైన రామకృష్ణ తమ్ముడు సత్తిబాబు మెడపై బండ కత్తితో దాడి చేశాడు. బాధితుడిని పిఠాపురం ఆసుపత్రికి తరలించారు. కొత్తపల్లి పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు.

ఐటీడీఏలకు మళ్లీ మహర్దశ

రంపచోడవరం, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మూడు ఐటీడీఏలకు మళ్లీ మహర్దశ పట్టనుంది. మంగళవారం అమరావతిలో గిరిజన సంక్షేమం, అభివృద్ధి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించి మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, ఇతర ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. 2014-19 కాలంలో రూపొందించిన అభివృద్ధి, సంక్షేమ ప్రణాళికలు వైసీపీ పాలనలో మూలనపడడం, గిరిజనులు ఐటీడీఏలకు దూరమవ్వడం వంటి అంశాలను ముఖ్యమంత్రి సీరియస్‌గా తీసుకున్నారు. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో గిరిజన సహకార సంస్థ, ట్రైకార్ వంటి వ్యవస్థలు అలంకారంగా మారి గిరిజనుల జీవన ప్రమాణాలను సైతం దెబ్బతీశాయి. ముఖ్యంగా గత ఐదేళ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని ఆశించి రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏలకు వచ్చే గిరిజనుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఒక విధంగా ఐటీడీఏలు ఉన్నాయన్న విషయాన్నే గిరిజనులు విస్మరించే పరిస్థితులున్నాయి.

విద్య, వైద్య రంగాల్లో గిరిజనులకు అందాల్సిన అనేక ప్రయోజనాలు 2019 తర్వాత అంతగా అందలేదు. ఐటీడీఏ లను ఆశ్రయించినా తగిన న్యాయం జరగని దుస్థితి గిరిజనులను అనేక ఇబ్బందులకు గురిచేసింది. ఈ విషయాలను గత ఐదు సంవత్సరాల ప్రగతి నివేదికల ద్వారా తెలుసుకున్న సీఎం చంద్రబాబు సదరు లోపాలపై అధికారులను నిలదీశారు. భవిష్యత్తులో ఐటీడీఏల నుంచి గిరిజనులకు ఎటువంటి అసౌకర్యాలు కలగరాదని, మరింత ఉత్తమంగా ఐటీడీఏల నుంచి సేవలు అందేలా చూడాలని, ఎక్కడా కూడా ఆరోగ్య సేవల కోసం గిరిజనులు డోలీలపై తరలించడం వంటి పరిస్థితులు కలగరాదని సూచించారు.

అల్లూరి జిల్లాకు వరద సాయం రూ.10 కోట్లు విడుదల

కలెక్టర్ దినేష్ వినతి మేరకు జీవో జారీ చేసిన ప్రభుత్వం

రంపచోడవరం, జూలై 30: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదల ప్రభావిత కుటుంబాలకు సహాయం చేసేందుకు ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేస్తూ మంగళవారం ఉత్తర్వులను జారీ చేసింది. అల్లూరి జిల్లాలో పరిస్థితులపై కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రభుత్వానికి నివేదిస్తూ సాయం కోసం రూ.15.29 కోట్ల అవసరమవుతాయన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి రూ.10 కోట్లను వరద సహాయానికి వినియోగించుకోవచ్చని కలెక్టరును ఆదేశించింది. 30 రోజులలోగా ఎవరెవరికీ సాయం అందించారో, దేనికి వెచ్చించారో ప్రభుత్వానికి నివేదించాలని ఆ ఉత్తర్వులో ప్రభుత్వం సూచించింది.

S.R.K.R. ENGINEERING COLLEGE (AUTONOMOUS)
Accredited by AICTE, New Delhi and Affiliated to JNTUK, Kakinada, NAAC with A+ Grade, CHINNA AMIRAM (PO) :: BHIMAVARAM, W.G.Dt.
☎ 98488 23332

ADMISSION NOTIFICATION FOR CATEGORY 'B' (NON-NRI QUOTA)

Applications are invited for admission into B.Tech. under Category-B (Non-NRI Quota) for the academic year 2024-25. Candidates seeking admission may apply directly into the portal https://cets.apsche.ap.gov.in under SPOT & CAT-B ADMISSIONS-2024 weblink from 01-08-24 to 05-08-24 or apply directly to the institution in person. For courses available & other details visit our website www.srkrec.ac.in. Eligibility of the candidates, Application registration fee is as prescribed by APSCHE.

Principal

వెలుగు వీవోఏ ఉద్యోగుల జిల్లా కమిటీ ఎన్నిక

కాకినాడ సిటీ, జూలై 30: కచేరీపేటలోని లక్ష్మీదాస్ భవన్‌లో ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా జి.బేబిరాణి, జిల్లా అధ్యక్షురాలిగా గంగాభవాని, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరిభాయి, కోశాధికారిగా జి.మేరీ, సహాయ కార్యదర్శులుగా టి.రాణి, ఆర్.శ్యామల, అమ్మణి ఎన్నికయ్యారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు పిఠాపురం కౌన్సిల్, రిక్విజిషన్ సమావేశాలు

పిఠాపురం, జూలై 30: పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, రిక్విజిషన్ సమావేశాలు బుధవారం జరగనున్నాయి. గత పదేళ్లలో కౌన్సిల్ రిక్విజిషన్ మీటింగ్ జరగడం ఇదే తొలిసారి. పురపాలక సంఘంలో ఖాళీగా ఉన్న 7 ఉద్యోగాలను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఆప్కాస్ ద్వారా భర్తీ చేయడంలో నిబంధనలు పాటించలేదని, ఇందులో భారీ అవినీతి జరిగిందని, కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వలేదని నాలుఅయిదు నెలలుగా టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో ఆరోపించడంతో పాటు తక్షణం ఉద్యోగాల నియామాకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని అజెండాకు తీసుకురావాలని పలుమార్లు కౌన్సిలర్లు కోరినా ఇప్పటి వరకూ తీసుకురాలేదు. ఇదే అంశంపై గత కౌన్సిల్ సమావేశాన్ని కౌన్సిలర్లు బహిష్కరించారు. దీంతో ఆప్కాస్ ద్వారా నియమించబడిన ఉద్యోగుల విషయాన్ని కౌన్సిల్ అజెం డాకు తీసుకురావాలని, ప్రత్యేకంగా రిక్విజిషన్ సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనరుకు లేఖ అందజేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాధారణ సమావేశానికి ముందు రిక్విజిషన్ సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో కౌన్సిల్‌లో పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. బుధవారం చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగే సమావేశాలకు సభ్యులు, అధికారులు హాజరు కావాలని కమిషనరు కనకారావు కోరారు.

నేడు గొల్లప్రోలు నగర పంచాయతీ సమావేశం

గొల్లప్రోలు, జూలై 30: గొల్లప్రోలు నగర పంచాయతీ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు జరుగుతుందని కమిషనరు రవికుమార్ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగే కౌన్సిల్ సమావేశంలో అజెండాతో పాటు సభ్యులు ప్రస్తావించే అంశాలపై చర్చించడం జరుగుతుందని.. సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ : కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 30: కొబ్బరిబొండాల వ్యర్థాలు, చెత్తాచెదారాలతో అపరిశుభ్రతకు నిలయంగా మారిన సామర్లకోట కెనాల్‌కు ఇరువైపులా సీఎస్ఆర్ నిధులతో సుందరీకరణ చేపట్టనున్నట్టు కాకినాడ కమిషనర్ భావన తెలిపారు. మంగళవారం ఆమె ప్రతాప్‌నగర్ బ్రిడ్జి నుంచి ఇంద్రపాలెం వంతెన వరకు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 1.5కిలోమీటర్ల పరిధిలో కెనాల్ ప్రాంతాన్ని పరిశుభ్రం చేయించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. చీడీలపొర డ్రైన్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులు పరిశీలించారు. 12వ సర్కిల్ పరిధిలోని బాలభవన్ వద్ద మస్టర్ కేంద్రాన్ని ఉదయం 5.30గంటలకు సందర్శించారు. ఆమె వెంట ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీఈలు, ఏఈలు ఉన్నారు.

'ప్రజా చైతన్యమే సర్వజన సమాజ్ లక్ష్యం'

ప్రత్తిపాడు, జూలై 30: ప్రజా చైతన్యమే సర్వజన సమాజ్ లక్ష్యమని ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ చెప్పారు. ప్రత్తిపాడులో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసి అన్ని కులాల, మతాల వర్గాల ప్రజలకు అన్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌లు, దోపిడీ, పర్యావరణ నష్టం వంటి వాటిపై ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. రత్నాకర్‌ను పలు సంఘాల నాయకులు పూలమాలలతో సన్మానించారు. సమావేశంలో కాజేటి అరుణ్‌కుమార్, అనుసూరి సతీష్, గొల్లపల్లి సూరిబాబు, ధారా నూకరాజు, కూసి రాంబాబు, కూసి కొండబాబు, యాళ్ళ ఏసు, గుర్రాజు, వెంకటేష్, ఇంటి వీర్రాజు, రాజాల రాజుకుమార్,దాకారపు కృష్ణ పాల్గొన్నారు.

'ప్రభుత్వ వసతిగృహాలను నిర్మించాలి'

పెద్దాపురం, జూలై 30: రామేశ్వరంపేట, సూరంపాలెం గ్రామాల మధ్యలో ప్రభుత్వ వసతిగృహాలను నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్ అన్నారు. స్థానిక విలేఖరులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ రామేశ్వరంపేట, సూరంపాలెం గ్రామాల్లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు హాస్టల్ ఫీజుల రూపంలో విద్యార్థుల నుంచి నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ ఫీజులు వసూలు చేస్తున్నారని, దీంతో విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచనచేసి ప్రభుత్వ వసతిగృహాలను నిర్మించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ధనరాజు, గౌతమ్, సురేష్ పాల్గొన్నారు.

తునిలో న్యాయ అవగాహన సదస్సు

తుని రూరల్, జూలై 30: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో న్యాయ అవగాహన సదస్సును తుని ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంఘం చైర్మన్, ప్రిన్సిపాల్, జూనియర్ సివిల్ జడ్జి కె.బాలకోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో మత్తు పదార్థాలు విద్యార్థులపై చూపిస్తున్న ప్రభావం, పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన శ్రద్ధ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆదిత్య కళాశాలల చైర్మన్ శేషారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువు ద్వారా విజ్ఞానాన్ని, మంచి నడవడకనుఅలవరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఈ భరత్‌వాజ్, నరసింహమూర్తి, బి.ఉమ, కె.కృష్ణశేఖర్, ఉపాధ్యాయులున్నారు.

పెద్దాపురప్పాడులో ఉచిత వైద్యశిబిరం

కరప, జూలై 30: పెద్దాపురప్పాడులో మంగళవారం ఉచిత కంటి, దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్టీఫెన్ ఆనంద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ మారెళ్ల స్టీఫెన్ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి సుమారు 500మంది విచ్చేసి వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైనవారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటివైద్య నిపుణులు డాక్టర్ తిరుమలశెట్టి అరుణ, దంత వైద్యులు డాక్టర్ ఆనెం చైతన్య వైద్యసేవలందించారు. ఉప సర్పంచ్ బిరుదా శ్రీనివాసఅప్పారావు, మాజీ సర్పంచ్ గొల్లపల్లి ప్రసాదరావు, ముడే చంద్రశేఖర్, జి.రామస్వామి, పి.శ్రీనివాస్, కె.సుబ్బారావు పాల్గొన్నారు.

ఎర్రవరంలో నేత్రదానం

ఏలేశ్వరం, జూలై 30: మండలంలోని ఎర్రవరంలో మైరాల చక్రరావు (85) మంగళవారం మృతిచెందారు. ఆయన మరణానంతరం కళ్లను దానం చేయాలని ఆకాంక్షించారు. వారి కుమారులు మాజీ ఎంపీటీసీ మైరాల కనకారావు, వివేకానంద సేవాసమితి అధ్యక్షులు మైరాల నాగేశ్వరరావు రాజమహేంద్రవరం రాధాకృష్ణ నేత్రాలయానికి సమాచారాన్ని అందజేశారు. వైద్యులు యర్రవరం చేరుకుని నేత్రాలను సేకరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జరిమానా

సర్పవరం జంక్షన్, జూలై 30: మద్యం తాగి బైక్‌లు నడిపిన ముగ్గురు వాహనదారులకు న్యాయమూర్తి తలో రూ.10 వేలు జరిమానా విధించినట్టు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ కోసం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం తాగినట్లు నిర్ధారణ కావడంతో ముగుర్ని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి నరసింహం ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునివ్వడం జరిగిందన్నారు.

శ్రీవీర వేంకటసత్యనారాయణస్వామి వారి దేవస్థానం
అన్నవరం - 533406, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఆర్.సి.నెం.సి1/478742/2024 తేది:30-07-2024

'ఇ'ప్రొక్యూర్‌మెంట్ టెండరు కం బహిరంగ వేలము ప్రకటన

శ్రీస్వామివారి దేవస్థానమునకు సంబంధించిన ఈ దిగువ ఐటమ్స్‌నకు సీల్డు టెండరు కం బహిరంగవేలం నిర్వహించబడును.

వ. సం	వివరములు	ప్రథమ ధరావత్తు రూ.	కాలపరిమితి	వేలం నిర్వహించు తేది
1	రత్నగిరి కొండపై వనదుర్గ ఆలయం దగ్గర మెయిన్ కేంటీన్ నిర్వహణ	5,00,000	2.సం.	అన్నవరం కొండపైన గల కళా మందిరం వద్ద ది.12-08-2024న ఉదయం 11 గంటలకు
2	సత్యగిరి కొండపై అంజలి ఉచిత కళ్యాణ మండపం ప్రక్కన గల కేంటీన్ నిర్వహణ	5,00,000	2.సం	
3	కొండ దిగువన అనంత లక్ష్మీసత్రం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.2 (1వ పర్యాయము)	50,000	3.సం	
4	కొండ దిగువ డబ్.టి.ఇ. షాపు నెం.4, (1వ పర్యాయము)	50,000	3.సం	
5	కొండ దిగువ డబ్.యస్.సి.షాపు నెం.7(1వ పర్యాయము)	50,000	3.సం	
6	బెండుర్తి గ్రామం సర్వే నెం.133/1, 133/2 నందలి ఎ.1.72 సెంట్లకు ఫలసాయం అనుభవించు హక్కునకు	2,000	1.సం	బెండుర్తి పంచాయితీ కార్యాలయం వద్ద ది.12-08-2024న మ.3.00 గంటలకు

బహిరంగ వేలం నందు పాల్గొను వారు హిందూ సాంప్రదాయం పాటించువారై వుండవలెను. సీరియల్ నెం.1 నుండి 5 వరకు ఈ-ప్రొక్యూయర్‌మెంట్ మరియు సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. టెండరు షెడ్యూల్సును ది.08.08.2024 నుండి ది.11.08.2024 వరకు కార్యాలయ పని వేళలలో రూ.1,180/- చెల్లించి పొందవచ్చును. టెండరు షెడ్యూల్ ది. 12.08.2024న ఉదయం 11.గంటల వరకు కొండపై కళావేదిక వద్ద వుంచడిన టెండరు బాక్సు నందు వేయవలెను. బహిరంగ వేలం అదే రోజున ఉదయం. 11.30 ని.లకు బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగ వేలం నిర్వహించిన తదుపరి మాత్రమే సీల్డు టెండరు బాక్సు తెరబడును. సీరియల్ నెం.6నకు ది.12.08.2024న మధ్యాహ్నం 3.గంటలకు బెండుర్తి గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద బహిరంగ వేలమునకు నిర్ణయించిన ప్రథమధరావత్తు బహిరంగవేలం సమయములో నగదును చెల్లించవలెను. హెచ్చుపాట లేదా టెండరు రేటు ను దేవదాయశాఖ చట్టం నందలి నిబంధనల మేరకు ఖరారు చేయబడిన హెచ్చుపాటదారుడు ఒక సంవత్సరము కౌలు సొమ్మును అడ్వాన్స్‌గా చెల్లించవలెను. ఇతర వివరములకు దేవస్థానం వెబ్‌సైట్ www.aptemples.ap.gov.in ఇ-ప్రొక్యూర్మెంట్ కొరకు https://tender.apendowments.gov.in మరియు కార్యాలయము పనివేళలలో గాని లేదా ఫోన్ నెం. 9908789955, 7013858713 నందు సంప్రదించవచ్చును.

కార్యనిర్వహణాధికారి

చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ


కరప: పెద్దాపురప్పాడు హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

పెద్దాపురప్పాడు (కరప), జూలై 30: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని, వారి శారీరక, మానసికోల్లాసానికి రోజూ డ్రిల్ పీరియడ్ ఉండేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే పంతం నానాజీ సూచించారు. కరప మండలం పెద్దాపురప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అన్ని పాఠశాలల్లో క్రీడలకు అవసరమైన సమస్త సదుపాయాలను కల్పిస్తామని, క్రీడాస్ఫూర్తితో మెలిగితే విద్యార్థులు బంగారు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఆరుగురు విద్యార్థినులకు మాజీ సొసైటీ అధ్యక్షుడు బొండా సూర్యారావు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, ఎలియన్స్ క్లబ్ ప్రతినిధుల సహకారంతో రూ.2,500 చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బిరుదా సరస్వతి అప్పారావు, ఎంపీటీసీ పబ్బిసెడి పద్మావతి, డీవైఈవో కె.వెంకటేశ్వరరావు, ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ, హెచ్ఎం శ్రీనివాస్, పీడీ బి.ప్రసాద్, తెల్గాని వెంకట్రావు, నాయకులు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, తుమ్మలపల్లి గోవిందు, వాసిరెడ్డి చిట్టిబాబు, గొల్లపల్లి బుజ్జి, పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనందించాలి : సత్యప్రభ

రౌతులపూడి, జూలై 30: ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలని ఎమ్మెల్యే వరపుల సత్యప్రభరాజా అన్నారు. బుధవారం మూలగపూడిలో హైస్కూల్ నందు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బ్యాగ్‌లు పుస్తకాలు అందజేశారు. విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని పరిశీ లించారు. రోజు మోనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, సర్పంచ్ తమరాల సత్యనారాయణ, ఎంపీటీసీ యామల సురేష్, మాజీ ఎంపీపీ ఇంటశెట్టి సూర్యభాస్కరరావు, జడ్పీటీసీ గొల్లు చినదివాణం పాల్గొన్నారు.

శంఖవరం: శంఖవరం మోడల్‌స్కూల్ నందు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, వెన్నా ఈశ్వరుడు, బద్దిరామారావు, ఉల్లి వీరభద్రారావు పాల్గొన్నారు.


రౌతులపూడి మండలం మూలగపూడిలో విద్యార్థులకు బ్యాగ్‌లు అందజేసిన ఎమ్మెల్యే సత్యప్రభ

అభివృద్ధే లక్ష్యం : యనమల


సమావేశంలో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, జూలై 30: తుని నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని అధికారులు, స్థానిక కార్యకర్తల సమావేశంలో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్, మున్సిపల్ అధికారులు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, పట్టణ టీడీపీ నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇటీవల యనమల చేసిన సూచనలకనుగుణంగా కుడా సంస్థ తుని మున్సిపాలిటీకి రూ.1.50 కోట్లు మంజూరు పత్రాలను సమావేశంలో వివరించారు. ఈ నిధులతో తుని పట్టణంలో శ్మశాన వాటిక, సిమ్మెంటు రోడ్లు, పార్కుల ఆధునీకరణ వంటి పనులకు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని యనమల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు, ఇనుగంటి సత్యనారాయణ, మళ్ళ గణేష్, కుక్కడపు బాలాజీ, నార్ల రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మలపల్లి రమేష్ పరిశీలన


ఉప్పలపాడులో రోడ్డును పరిశీలిస్తున్న రమేష్

గండేపల్లి, జూలై 30: మండలంలోని ఉప్పలపాడులో దుర్గమ్మతల్లి గుడి దగ్గర నుంచి సబ్‌స్టేషన్ వరకు డ్రైనేజీ లేకపోవడం వల్ల వర్షపు, వాడకం నీరు రోడ్డుపైకి వచ్చి నిలిచిపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రమేష్ ఉప్పలపాడు జనసేన నాయకుడు మేడిపోయిన శ్రీనుతో కలిసి ఆ రోడ్డును పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మరిసే రామకృష్ణ,సూరపురెడ్డి నరేష్,సోమరాజు ఉన్నారు.

జగ్గంపేట: మన్యవారిపాలెనికి చెందిన నక్క వెంకన్న ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'సమస్యలు పరిష్కరించాలి'

కాకినాడ రూరల్, జూలై 30: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోరుతూ కాకినాడ జిల్లా డీఈవో పిల్లి రమేష్‌కు మంగళవారం ఎస్టీయూ కాకినాడ జిల్లాశాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మొర్త శ్రీనివాస్ అధ్యక్షతన వినతి పత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయుల పదవీ విరమణ ఖాళీలను నెలవారీ పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని.. ఎస్ఏసీ సప్లిమెంటరీ విధులు నిర్వహించిన హెచ్ఎం, సీనియర్ ఎస్ఏలకు సంపాదిత సెలవులు మంజూరు ప్రొసీడింగ్స్ ఇప్పించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు కొరత ఉన్న ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై సబ్జెక్టు ఉపాధ్యాయులను తాత్కాలికంగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కె.కాశీ విశ్వనాద్, రాష్ట్ర కార్యదర్శి యు.శ్రీను, రాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ శ్రీనివాస్, రామ్‌తేజ, మహేష్,శ్రీకాంత్, ప్రసన్నకుమార్ ఉన్నారు.

'టీడీపీతో సొంతింటి కల సాధ్యం'

కాకినాడ సిటీ, జూలై 30: పేదవాడి సొంతింటి కల టీడీపీతోనే సాధ్యమని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో కేంద్ర సాయంతో కలిపి పేదవాడి ఇంటి నిర్మాణానికి కూటమి ప్రభుత్వం రూ.4లక్షలు అందించనుందన్నారు. గత ప్రభుత్వం పూర్తి చేయకుండా నిలిపివేసిన ఇళ్ల నిర్మాణాలను కూడా పూర్తి చేసి పేదలకు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మధ్య తరగతి వారి ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు అందజేయనున్నట్టు సీఎం ప్రకటించడం ఆనందకరమన్నారు.

'శ్యామ్ సేవలు అభినందనీయం'

కాకినాడ క్రైం, జూలై 30: పోలీసు ఉద్యోగాల సాధనలో నిరుద్యోగ యువతకు శ్యామ్ ఇనిస్టిట్యూట్ సంస్థ ఇస్తున్న శిక్షణ అభినందనీయమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో శ్యామ్ సంస్థ అధినేత గుంటూరు శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉత్తమ తర్ఫీదునిస్తూ యువత ఉద్యోగాలు సాధించేలా చేస్తున్న సంస్థ సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఎస్పీని కలిసినవారిలో పీడీ కాంతారావు ఉన్నారు.

పిట్టా వరప్రసాద్‌కు సత్కారం

కాకినాడ సిటీ, జూలై 30: రిపబ్లికన్ పార్టీ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన పిట్టా వరప్రసాద్ మంగళవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండబాబు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, దళిత నాయకులు పాల్గొన్నారు.

నాన్‌స్టాప్ బస్సులకు బోర్డింగ్ పాయింట్

పిఠాపురంలో జనసేన నేతల స్వాగతం


స్వాగతం పలుకుతున్న నాయకులు

పిఠాపురం, జూలై 30: ప్రముఖ పుణ్యక్షేత్రమయిన పిఠాపురానికి తరలివచ్చే ప్రయాణికులు, భక్తుల వినతులు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో నాన్‌స్టాప్ బస్సులతో పాటు ముఖ్యమైన సర్వీసులకు పాదగయ క్షేత్రం వద్ద బోర్డింగ్ పాయింట్ సౌకర్యం కల్పించామని కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ తెలిపారు. పిఠాపురం పోలీసు సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాప్ వద్ద నాన్‌స్టాప్ బస్సుకు జనసేన నాయకులు మంగళవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కాకినాడ నుంచి విశాఖ వెళ్లే నాన్‌స్టాప్ బస్సుకు పిఠాపురం సీఐ కార్యాలయం వద్ద, విశాఖ నుంచి కాకినాడ వెళ్లే సర్వీసు పాదగయ క్షేత్రం వద్ద స్టాపు సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. నిత్యం పిఠాపురం నుంచి రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో సర్వీసులు మరింత పెంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అదేవిధంగా సర్వీసు రోడ్డు ఏర్పాటుకు ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడతామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి'

సర్పవరం జంక్షన్, జూలై 30: రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకుని రోడ్డు ప్రమాదాల నివారణలో భాగస్వామ్యం కావాలని అక్షరా ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ప్రిన్సిపాల్ ఎస్ ప్రశాంతశ్రీ పిలుపునిచ్చారు. మంగళవారం తిమ్మాపురం అక్షరాఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో జాతీయ సేవా సమితి (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎం.శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, డాక్టర్ పోచయ్య, డాక్టర్ మధు కుమార్, డాక్టర్ గోపి, మనోజ్ తదితరులున్నారు.

పెరుమాళ్ళపురంలో ర్యాలీ

తొండంగి: ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణరక్షణ పొందాలని నినాదాలతో పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల నుంచి పెరుమాళ్ళపురం సెంటర్ వరకూ ర్యాలీ జరిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము, పివిక్షారావు, డాక్టర్ దివాకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఉన్నతాధికారుల పూజలు

సామర్లకోట, జూలై 30: సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆదాయపు పన్ను శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మధుస్మితా, చీఫ్ కమిషనర్ పరీంద్ర మెహెతా, ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్ల, ప్రిన్సిపల్ కమిషనర్ (అడ్మిన్) రవికిరణ్, టీడీఎస్ అధికారి నరేష్ సాకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఉన్నతాధికారులకు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సాదరంగా స్వాగతం పలికారు. ఉపాలయాలను దర్శించి స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. నందిమండపం వద్ద పండితులచే వేద స్వస్తి పలికి ప్రసాదాలు చిత్రపటాలను అందజేశారు. పండితులు సోమేశ్వర శర్మ, చెరుకూరి రాంబాబు తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలను తాకి మహిళకు తీవ్రగాయాలు

సామర్లకోట, జూలై 30: పట్టణ పరిధిలో గణేష్‌కాలనీలో నిర్మాణంలో ఇంటికి పైపుతో నీటిని పెడుతుండగా ఇంటిపైన విద్యుత్ తీగలను తాకి అదే ప్రాంతానికి చెందిన కూలీ మల్లవరపు మంగ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమెను ఉన్నత చికిత్సకు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుందరరావు సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ

జేఎన్టీయూకే, జూలై 30: పరిశీలకుల బృందం సిఫార్సుల మేరకు బాదం ఎన్‌వీవీఎస్ సుందరరావు సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీగా జేఎన్టీయూకే ఆమోదముద్ర లభించినట్టు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ తెలిపారు. ఆయనకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అవార్డు సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో యాన్ ఇన్వెస్టిగేషన్ ఆన్ స్ట్రెంథనింగ్ స్ట్రక్చరల్ ఎలిమెంట్స్ ఆఫ్ కాంక్రీట్ అడాప్టింగ్ డిఫరెంట్ టెక్నిక్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగానూ లభించిందన్నారు. ఆయన తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడ జేఎన్టీయూకేలోని పరిశోధనాభివృద్ధి డైరెక్టర్, సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ విప్పర్తి రవీంద్ర ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

పాఠ్యపుస్తకాల అందజేత

గొల్లప్రోలు, జూలై 30: క్రమశిక్షణతో విద్యనభ్యసించడం ద్వారా ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శాంతి రాజశ్రీ సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌ను ఆమె అందజేశారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

కొత్తపల్లి, జూలై 30: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు మండలంలోని కొండెవరంలో గురువారం పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, ఆర్డీవో ఇట్ల కిషోర్ మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. జొరిరాజు పేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, ఇందిరానగర్, శెట్టి బలిజపేటల్లో నాగబాబు పింఛన్లు పంపిణీ చేసేందుకు నిర్ణయించారు. సమావేశంలో ఎంపీడీవో పి.వెంకటనారాయణ, ఈవోపీఆర్డీ ఎంఎస్‌భాస్కర్, కొండెవరం ఎంపీటీసీ దుళ్ళ సత్తిబాబు, వేమగిరి రాంబాబు, వాసంశెట్టి వెంకట రమణ, కందా తలుపులరావు, వీఆర్వో కుసురాజు తదితరులు ఉన్నారు.

2న విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు శిబిరం

పిఠాపురం, జూలై 30: పట్టణంలోని రథాలపేట సెంటర్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో ఆగస్టు 2న జరిగే విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు శిబిరాన్ని వినియోగించుకోవాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం సమావేశంలో ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులైన వారు తగిన ధ్రువీకరణపత్రాలతో రావాలని చెప్పారు. వచ్చిన వారికి 3చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్స్, చంక కర్రలు, కృత్రిమకాళ్లు, కాలిపర్స్, రోలేటర్స్, చెవి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంతుల పిల్లలుకు ఎంఎస్ఎస్ఈ కిట్లు, లెప్రసీ సోకిన వారికి ఏడీఎల్ కిట్లు, సీపీచైర్, బ్యాటరీ ఆపరేటెడ్ 3చక్రాల సైకిళ్లు తదితర పరికరాల ఆవశ్యకతను గుర్తించడం జరుగుతుందన్నారు.


ప్రత్తిపాడులో విరాళం అందజేస్తున్న శ్రీనివాసరావు

రామాలయానికి విరాళం

ప్రత్తిపాడు, జూలై 30: ప్రత్తిపాడు నరేంద్రగిరిపై శ్రీమద్ రామాయణ పీఠం ఆధ్వర్యంలో ఆంధ్రా భద్రాద్రిపేరుతో నూతనంగా నిర్మితమైన రామాలయానికి ప్రత్తిపాడు కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు రూ.1,01116 విరాళం అందజేశారు. నరేంద్రగిరి శ్రీరామ క్షేత్రం వద్ద మంగళవారం సర్పంచ్ గుడాల విజయలక్ష్మి వెంకటరత్నం సమక్షంలో కార్యదర్శి శ్రీనివాసరావు ఈ మొత్తాన్ని శ్రీమద్ రామయణ పీఠం అధ్యక్షుడు గల్లా సుబ్బారావుకు అందజేశారు. దాతలను శ్రీరామనామ క్షేత్రం అధ్యక్షుడు గోగుల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు తేజోమూర్తుల త్రినాద్, పత్రి రమణ, సర్పంచ్ దంపతులు అభినందించారు. శ్రీ మద్ రామాయణ పీఠం సభ్యులున్నారు.

ఆయకట్టుకు నీరు విడుదల

ఏలేశ్వరం, జూలై 30: మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో మంగళవారం ఆయకట్టుకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సాగు నీరు విడుదల చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు బుజ్జి పుష్కర లిఫ్టు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి ఎకరాకు సాగు నీరందే విధంగా అధికారులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బుద్ధా సూర్యప్రకాశరావు, సుంకర సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రాగుల పంపిణీ

గండేపల్లి, జూలై 30: మండలంలోని తాళ్ళూరులో ఏవో సద్గురుమూర్తి మంగళవారం 50శాతం రాయితీపై రైతులకు రాగుల పంపిణీ నిర్వహించారు. సర్పంచ్ శీలామంతుల వీరబాబు, ఉపసర్పంచ్ పైణ్ణి వెంకటేశ్వరరావు, టీడీపీ గ్రామాధ్యక్షుడు కొండ్రు అప్పలరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ చిరుధాన్యాలు సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ఈ విత్తనాలు అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాగి నారుమడి పరిశీలన

శంఖవరం, జూలై 30: మండలంలోని జగ్గంపేట గ్రామంలో రాగి పంట కోసం రైతులు తయారు చేసిన నారుమడిని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ పరిశీలించారు. నారుమడులు తయారీలో రైతులకు తీసుకోవల్సిన జాగ్రత్తలు సూచించారు. బీజా మృతంతో విత్తన శుద్ధిచేసిన తరువాత 5 సెంట్లు నేలలో 2.5 కిలోల విత్తనాలు జల్లుకోవాలన్నారు.

చారుమజుందార్ వర్ధంతి

రౌతులపూడి, జూలై 30: రౌతులపూడిలో సీపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ చారుమజుందార్ 52వ వర్ధంతిని నిర్వహించారు. కమిటీ సభ్యుడు సామిరెడ్డి నారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పేరూరి లక్ష్మి, పందిరి కుమారి, తిపరాల రత్నం పాల్గొన్నారు.

కోటనందూరు: కామ్రేడ్ చారుమజుందార్ వర్ధంతిని కెఇ చిన్నయ్యపాలెంలో నిర్వహించి ర్యాలీ చేశారు. బుగతా బంగారాజు, జనార్ధన్, దడాల లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లేపల్లిలో అన్నదానం

గండేపల్లి, జూలై 30: మండలంలో మల్లేపల్లి జాతీయరహదారిని ఆనుకుని అభయాంజనేస్వామి ఆలయం వద్ద మంగళవారం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ బిక్రా రమణ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. భారీగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. కమిటీ సభ్యులు తెమ్మనబోయిన జయ, దార్లంక శ్రీనివాసరావు, అక్కిరెడ్డి సత్తిబాబు, వల్లభశెట్టి వంశీ, అక్కిరెడ్డి జానకిరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు

ప్రత్తిపాడు, జూలై 30: శరభవరంలో మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నాగేంద్రస్వామి సహిత శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఆడికృత్తిక మహోత్సవాన్ని పురస్కరించుకుని పాల కావెళ్ళ సంబరం కోలాహలంగా నిర్వహించారు. శరభవరం, గజ్జనపూడి, కొత్తూరు గ్రామాల్లో పాల కావెళ్ళతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయంలో స్వామి,అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

కొమరగిరిలో రుద్రాభిషేకం

కొత్తపల్లి, జూలై 30: కొమరగిరి శ్రీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అష్టోత్తర పుష్పార్చన నిర్వహించారు. విశేష అలంకరణతో సుబ్రహ్మణ్యస్వామిని భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అర్చకులు శివరామకృష్ణ భక్తులకు తీర్థప్రసాదాలందించారు.

విద్యార్థినికి అభినందన

ఏలేశ్వరం, జూలై 30: ఇటీవల పట్టణానికి చెందిన పడాల చారిటబుల్ ట్రస్ట్, తానా ఫౌండేషన్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో 60 మార్కులకు 57 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎస్.నేహశ్రీని ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ తులసి సమక్షంలో ట్రస్ట్ సభ్యులు ప్రశంసాపత్రం, షీల్డ్, మెడల్ అందజేశారు. వెన్నా శ్రీను, చినబాబు పాల్గొన్నారు.

మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం

జగ్గంపేట, జూలై 30: జె.కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో ఎం.పూర్ణిమ మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంహెచ్ఎల్‌పీపీ ఉషా, ఏఎన్ఎం మున్ని, ఆశాలు అరుణ, సూపర్‌వైజర్ అమ్మాజీ, బాలికలు ఉన్నారు.

